# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# మీ దరిద్రపు పాలన మాకొద్దు

ఉమ్మడి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. సరిపడా కరెంట్ లేక, అస్తవ్యస్తమైన భూ రికార్డులతో ఆగమయ్యారు. పాసుబుక్కుల్లో భూములు తారుమారు కావడంతో తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. భూముల భద్రతకు పటిష్టమైన ధరణి పోర్టల్ తెచ్చింది. అనేక మాడ్యూళ్ల ద్వారా రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర ప్రక్రియలను సులభతరం చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఎవుసానికి 3 గంటల కరెంట్ సాలనీ, ధరణిని బంగాళఖాతంలో కలుపుతమని ఆగం చేస్తున్నారు. వారి విధానాలను తెలంగాణ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మమ్మల్ని పరేషాన్ చేస్తున్న కాంగ్రెస్సోళ్లకు బుద్ధి చెబుతమని ముక్తకంఠంతో తేల్చిచెబుతున్నారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు.

## కాంగ్రెస్ అంటేనే కన్నీళ్లు వస్తున్నాయి



చెన్నూర్ రూరల్, నవంబర్ 28 : మళ్లీ కాంగ్రెస్ పాలన అంటేనే కన్నీళ్లు వస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పాలనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు నలిగిపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందే..పార్టీ నాయకులు రైతులకు 3 గంటల కరెంట్ చాలు, ధరణితో రైతులు నష్టపోతున్నారు అని తప్పుడు మాటలు చెబుతున్నారు. వీరి విధానం వల్ల రైతులే కాదు మహిళలు, యువకులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఆలోచిస్తున్నారు. అధికారం రాకముందే రెండు వ్యాఖ్యలతో తెలంగాణ రైతులను దెబ్బకొట్టారు. ఇక తప్పిదారి అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రజల పరిస్థితి ఏమిటని అని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారు. ప్రతి నియోజక వర్గంలో కాంగ్రెస్ పాలన మాకు వద్దు అంటూ వ్యాపారవేత్తలు, కుల సంఘాలు, మహిళా సంఘాలు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీ అధికారంలోకి రాదు.

**- కాళేశ్వరం సమ్మగౌడ్, రైతు, కొమ్మెర**

## ధరణితోనే రైతులకు మేలు



జైపూర్, నవంబర్ 28 : ధరణితోనే రైతులకు మేలు జరిగింది. భూ రికార్డులకు భద్రత కలిగింది. కాంగ్రెస్ ధరణి తీసేస్తామనడం మూర్ఖత్వం. ధరణితో భూముల హక్కులపై దళారుల పెత్తనం పూర్తిగా తొలిగిపోయింది. అస్తవ్యస్తంగా ఉన్న భూరికార్డులు ధరణితో చక్క బడ్డాయి. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. భరోసాతో బతుకుతున్నరు. రైతు వేలు ముద్ర లేనిది భూ బదాలాయింపు జరుగదు. ఆఫీసుల చుట్టూ తిరిగే బాధపోయింది. ఇంతకు ముందు రాత్రికి రాత్రే భూమి ఒకరి నుంచి మరొకరికి మారేది. ఇప్పుడు ఆ తిప్పలు లేవు. ధరణి తీసేస్తే రైతులు ఆగం కాక తప్పదు. ధరణి వల్ల మోసాలు లేవు. మనం ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. మ్యుటేషన్ కూడా వెంటనే ఇస్తున్నారు.

**-వెన్న శంకర్ జైపూర్ గ్రామం, జైపూర్ మండలం**



## కాంగ్రెసోళ్ల ముచ్చటే వద్దు

కాసిపేట, నవంబర్ 28 : తెలంగాణలో ధరణితో భూ సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయి. గతంలో సరైన భూముల వివరాలు సక్రమంగా లేక అనేక ఇబ్బందులు పడ్డం. ఇప్పుడు ఎలాంటి దళారీ వ్యవస్థ లేదు. ధరణి రద్దు చేసి పాత రెవెన్యూ వ్యవస్థ తీసుకొస్తరట. అంతకంటే దరిద్రం ఏముంటుంది ఇగ. మళ్లా లంచాలు ఇచ్చుకుంట. మళ్లా ఆఫీసుల చుట్టూ తిరుగాలా? కాంగ్రెసోళ్ల ముచ్చట ఎత్తుడే వద్దు.

**-కడారి తిరుపతి, రైతు, కాసిపేట**

## కౌలురైతు కాలమ్‌తో అసలు రైతుకు ఎసరు



దండేపల్లి, నవంబర్ 28 : కౌలురైతు కాలమ్‌తో అసలు రైతుకు ఎసరు వచ్చి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కౌలుదారు రైతుల పేర్లు నమోదు చేయడంతో అసలు భూమి యజమానులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడుతాయి. ధరణితోని ఎవరి భూమి.. వారికి ఉండడం వల్ల ఎలాంటి సమస్యలుండడం లేదు. ధరణి మారిస్తే పల్లెల్లో భూ సమస్యలకు సంబంధించిన గొడవలు జరుగుతాయి. గతంలో ఒకరి భూములు మరొకరికి మారుస్తూ వాటిని మా పేరుపై మార్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. అధికారుల చుట్టూ తిరిగినా ఎవ్వరు పట్టించుకోలేదు. రైతుల భూములు తారుమారు కాకుండా, రికార్డుల్లో అవకతవకలు జరుగకుండా, రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. ధరణి రద్దు చేయడం వల్ల రైతాంగం ఎన్నో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. మళ్లీ పాత రికార్డులు ఉంటే బడా బాబులు అవకతవకలకు పాల్పడే అవకాశం ఉన్నది. తెలంగాణ రైతులు ప్రస్తుతం ఎంతో సంతోషకరంగా ఉన్నారు.

**-గోళ్ల లక్ష్మయ్య, రైతు, తాళ్లపేట గ్రామం, దండేపల్లి మండలం**

## కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్లా గోస పడుడే..

నెన్నెల, నవంబర్ 28 : నా పేరు పూదరి అంజన్న. మాది నెన్నెల. మాకు ఐదెకరాల భూమి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అప్పు తెచ్చి బోరు వేయించిన. కరెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న. ఆఫీసుల చుట్టూ తిరిగిన. ఆరు నెలలకు కరెంట్ లైన్ ఇచ్చిండ్లు. ఇక రెండు పంటలు పండుతాయనుకొని సంబురపడ్డా. ఆ యేడు వానకాలం పంట వేసిన. అప్పుడు ఆడపాదడపా వర్షాలు కురిసాయి. వరి పొట్టకువచ్చింది. ఇక కరెంటే దిక్కనుకొని పంటకు నీళ్లు పెడుదామని పోతే.. ఆ కరెంట్ కూడా ఉండకపోయేది. పొద్దంతా ఎదురు చూసి చూసి కండ్లు మూతపడేవి. రాత్రి ఎప్పుడో కరెంట్ వచ్చేది. ఒకవేళ ఇచ్చినా మూడు గంటలే ఇచ్చేటోళ్లు. ఒక్క మడి కూడా తడవకపోయేది. తెలంగాణ వచ్చిన తర్వాత రైతులకు న్యాయం జరిగింది. ఇప్పుడు మాకు రెండు పంటలు పుల్లుగా పండుతున్నయి. 24 గంటల పాటు ఉచితంగా కరెంట్ ఇస్తున్నది. మాకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. ఒక్కసారి మోటర్ స్టార్ట్ చేసి వస్తే చివరి మడి వరకు నీళ్లు పారి నిండి పోతున్నయి. రెండు పంటలు అనుకున్నంత పండుతున్నయి. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్ ఇస్తాం.. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నరు. అందరూ ఒకేసారి కరెంట్ వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా. స్టార్టర్లు, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా ప్రతి ఒక్కటి రిపేరుకు పోతయి. కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్లా గోస పడుడే..

**-పూదరి అంజన్న, రైతు, నెన్నెల**



## మూడు గంటల కరెంట్‌తో మూల కూడా తడువదు



జైపూర్, నవంబర్ 28 : బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన కాన్నుంచి 24 గంటల కరంట్‌తో రందిలేకుండా ఎవుసం చేసుకుంటున్నం. కాంగిరేసోడు మూడు గంటల కరంట్ ఇస్తమంటుండు. మూడు గంటల కరంట్‌తో మూలకూడ తడువదు. ఎవుసం బంద్ చేసుకోవాల్సిందే. గప్పటి సర్కారు వాళ్లు ఇచ్చిన కరంట్‌తో ఎన్నో తిప్పలుపడ్డం. కరంట్ కోసం రాత్రి పగలు పొలాల దగ్గర పండుకోవాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ సీఎం అయినంక మా బాధలన్నీ పోయినయ్. తిప్పలు లేకుండా పంటలు పండిస్తున్నం. మూడు గంటల కరంట్ ఇచ్చే కాంగిరేసోళ్లు మాకు వద్దు. రైతు క్షేమం కోసం ఎల్లకాలం తిప్పలవడుతున్న కేసీఆరే మాకు ముద్దు. కారు గుర్తుకు ఓటు వేస్తం. తెలంగాణ అభ్యర్థులను గెలిపించుకుంటం.

**- అల్లి భానయ్య రైతు, దొరగారిపల్లి ఇందారం గ్రామం, జైపూర్ మండలం**

## కాంగ్రెస్ మాట వింటే కరెంటుకు కటకటే...



తాండూర్, నవంబర్ 28 : పొరపాటున కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ కోసం రేయింబవళ్లు ఎదురుచూడాల్సిందే. గతంలో వారి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో పంటలకు సరిపడా కరెంట్ ఉంది. సీఎం కేసీఆర్ సార్ దూరదృష్టితో కరెంట్ కష్టాలు పూర్తిగా తొలిగిపోయాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు చల్లగా బతుకుతున్నరు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వచ్చి అది చేస్తాం, ఇది చేస్తామంటూ మాయ మాటలు చెబుతున్రు. వాటిని నమ్మితే మళ్లీ మోసపోతాం. 3 గంటల కరెంట్ ఇస్తే ఏ మూలన నీళ్లు పారుతాయి. 10 హెచ్‌పీ మోటర్‌ను పెట్టుకునే స్థోమత రైతులకు ఉండదు. రైతు రాజ్యం కోసం మళ్లీ కేసీఆరే సీఎం కావాలి.

**-డోలి హన్మంత్, రైతు, అచ్చలాపూర్, తాండూర్**

## మళ్లీ కాంగ్రెస్ సర్కారు రోజులు రావద్దు..



తాండూర్, నవంబర్ 28 : కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి వాళ్లకు ఓట్లేస్తే మళ్లీ పాత రోజులొస్తయి. అలాంటి పరిస్థితి రావొద్దన్నదే మా అభిప్రాయం. మూడు గంటల కరెంట్ సరిపోక గతంలో రాత్రిళ్లు బావుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి. కాంగ్రెస్ వాళ్ల మాటలు వింటే మళ్లా చీకట్లో నిద్ర పోకుండా కరెంట్ కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడుతది. పదేళ్ల క్రితం ఆ పార్టీ ప్రభుత్వంలో రైతులు రాత్రిపూట బావుల కాడికి పోయి ఎంతో మందికి దెబ్బలు తగిలినయ్. చీకట్లో బావుల వద్దకు వెళ్తే ఏం జరుగుతుందో తెలియదు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులు ఇప్పుడిప్పుడే మంచిగా ఉంటున్నరు. రాత్రిపూట కరెంట్ కోసం బావుల కాడికి భయంతో పోయే బాధలు తప్పినయ్. మళ్లీ రాత్రి పూట కరెంట్ కోసం జాగారం చేసే రోజులు మాకొద్దు. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వానికే మా మద్దతు.

**-డోలి, రాజన్న, రైతు, అచ్చలాపూర్, తాండూర్**

## కొట్లాటలు పెట్టిద్దామని చూస్తున్నది



చెన్నూర్ రూరల్, నవంబర్ 28 : కాంగ్రెస్ పార్టీ అడ్డదిడ్డంగా మాట్లాడుతుంది. ధరణి తీసేస్తమని చెబుతుంది. సర్కారు తీసుకొచ్చిన ఈ పోర్టల్ వల్ల భూములకు రక్షణ కలిగింది. ఈ వ్యవస్థ తీసేసి మళ్లా కొట్లాటలు పెట్టిద్దామని చూస్తున్నది. ఇగ ఏ పనులు కావు. ఇవన్నీ దళారులను బతికిచ్చే ప్లాన్‌లే. మళ్లా ఆఫీసుల చుట్టూ తిరిగి చావమని ఉన్నట్లున్నది కాంగ్రెస్ తీరు. రేవంత్‌రెడ్డిని నమ్మితే ఉన్నదంతా అమ్ముకునుడే అయితది. కరెంట్ లేక, పంటలు పండక, ఉద్యోగాలు రాక, విద్య, వైద్యం అందక, రోడ్లు, బ్రిడ్జిలు లేక ప్రజలు పడ్డ కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటున్నరు. ఏదేమైనా కాంగ్రెస్‌ను అధికారంలోకి రానీయం.

**- దేగల శేఖర్, యువకుడు, చెన్నూర్**